# సంపాదకీయం

## చట్టసభల గుమ్మంలో ప్రజాస్వామ్య ద్రోహం

ప్రజాస్వామ్యానికి దేవాలయాలుగా,కోట్లాది మంది ప్రజల ఆశాజ్యోతులుగా వెలుగొందే చట్టసభల ప్రాంగణం నేడు అధికారమదంతో కూడినపోలీసు దౌర్జన్యాలకు వేదికగా మారడంసమకాలీన రాజకీయ చరిత్రలో అత్యంత అసహ్యకరమైన, లజ్జాకరమైన అధ్యాయం. శాసనసభ ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన అనాగరిక, దురహంకారపూరిత తీరు రాజ్యాంగస్ఫూర్తిని నిలువునా దహించివేసింది.ప్రజల గొంతుకగా అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల జుట్టు పట్టుకుని లాగడం, గొంతు నులమడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చీరలు లాగుతూ వ్యవహరించడం ఏ రకమైన పాలనకు సంకేతం? ఇది కేవలం కొందరు నేతలకు జరిగిన పరాభవం కాదు; ఇది దేశంలోని మొత్తం మహిళా సమాజానికి, రాజ్యాంగ వ్యవస్థలకు జరిగిన పూడ్చలేని గాయం.ప్రజాస్వామ్యంలోనిరసనలు తెలుపడం, ప్రభుత్వాన్నిప్రశ్నించడం,ప్రజా సమస్యలపైనిలదీయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రభుత్వ వైఫల్యాలు, పనితీరుపై ప్రజాప్రతినిధులు శాసనసభకు వచ్చి నిరసనను వ్యక్తం చేయడం అనాదిగా వస్తున్న ప్రజాస్వామ్య సంప్రదాయం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు శాసనసభకు చేరుకున్న మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులమైన నాపై (పి. సబితా ఇంద్రారెడ్డి),సునీతా లక్ష్మారెడ్డితోపాటు ఇతర మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రదర్శించిన నిర్బంధ వైఖరి శాంతిభద్రతల పరిరక్షణ కాదు;అది కేవలం అధికారపక్ష అణచివేత ధోరణి. శాసనసభ ముంగిట నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, భౌతిక దాడులకు పూనుకోవడం రాజ్యాంగబద్ధమైన పాలన స్థానే పోలీసు రాజ్యాన్ని ప్రతిష్ఠించే కుట్రలా కనిపిస్తున్నది. 'ప్రజాపాలన' అనే పదబంధాన్ని ఊతపదంగా వాడుకొనే ప్రస్తుత పాలకుల అసలు రంగు ఈ ఘటనతో పూర్తిగా బయటపడింది. ఈ ఘోర కలికి కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయిలో మాట్లాడే నీతులకు, రాష్ట్ర స్థాయిలోవారు అనుసరిస్తున్నఅణచివేత చర్యలకు ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని ఎండగట్టాల్సిన అవసరంఉన్నది.కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నల్లచొక్కాలు ధరించి, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపినప్పుడు అది ప్రజాస్వామ్య పరిరక్షణగా, రాజ్యాంగ హక్కుగాఊదరగొట్టినఆ పార్టీ నాయకత్వం,నేడు తెలంగాణ అసెంబ్లీ వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్ట్‌లతో అసెంబ్లీకి వస్తే పోలీసులతో దాడి చేయించడంలో ఉన్న ఔచిత్యం ఏంది? జాతీయ స్థాయిలో ఒక రాజ్యాంగ సూత్రం,స్వయంగా అధికారంలో ఉన్న రాష్ట్రంలో మరొక అణచివేత సూత్రంచెల్లుబాటు అవుతుందా? రాహుల్ నిరసనతెలిపితే అది పోరాటం, తెలంగా ణలో మహిళా ప్రజాప్రతినిధులునిరసన తెలిపితే నేరమా?ఈ దగాకోరు ద్వంద్వ విధానాన్ని ప్రజాస్వామ్యవాదులు ఏవిధంగా సమర్థిస్తారు?భారత రాజకీయ చరిత్రను తిరగేస్తే,చట్టసభల లోపలలేదా వెలుపల మహిళా నేతలపై భౌతికదాడులకు దిగిన ప్రతిసందర్భంలోనూ పాలకులు ప్రజల గ్రహపాటుకు గురయ్యారనేది స్పష్టమవుతున్నది.తమిళనాడు శాసనసభలోనాటి ప్రతిపక్ష నేత జయలలితపైఅసెంబ్లీ ప్రాంగణంలో దాడి చేసి,ఆమెచీరను లాగి అవమానించినప్పుడు,కన్నీళ్లతో బయటకువచ్చినఆమె మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడుతానని శపథం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ రాష్ట్ర రాజకీయ చిత్రాన్నే మార్చేశాయి. 1995లో ఉత్తరప్రదేశ్‌లో మాయావతిపై జరిగిన భౌతికదాడినాటి ప్రభుత్వ పతనానికి నాంది పలికింది. కేరళశాసనసభలో 2015బడ్జెట్ సమావేశాల సందర్భంగా మహిళాఎమ్మెల్యేలపై జరిగినఅణచివేత చర్యలు తీవ్ర వ్యతిరేకతకు దారితీశాయి. సింగూర్ ఉద్యమ సమయంలో టీఎంసీ అగ్ర నేత మమతా బెనర్జీని పోలీసులు ఈడ్చిపారేసిన దృశ్యాలు వామపక్ష ప్రభుత్వ శాశ్వత పతనానికి బాటలు వేశాయి. చరిత్ర నేర్పిన ఈ గుణపాఠాలను కాంగ్రెస్ పాలకులకు గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నది.అధికారమదంతో మహిళా నేతలఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ఏప్రభుత్వం పూనుకున్నా,కాలక్రమంలో వారు తీవ్ర రాజకీయ పరిణామాలను ఎదుర్కోక తప్పదు. ఒకవైపు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాలు తెస్తున్నామని గొప్పలు చెప్పుకొనేరాజకీయ వ్యవస్థ,మరోవైపుఎన్నుకైన మహిళా ప్రజాప్రతినిధులమీదనే ఈ రకమైన తీవ్రభౌతికదాడులకు దిగడం హేయమైన చర్య. మాజీ మంత్రులుగా, శాసనసభ్యులుగా సమాజంలో ఎంతో గౌరవం ఉన్న నాకు (సబితా ఇంద్రారెడ్డి), సునీతాలక్ష్మారెడ్డి వంటి సీనియర్ నాయకులకే రక్షణ లేకపోతే, రేపు రాజకీయాల్లోకి రావాలనుకునే సాధారణ మహిళలకుఈ వ్యవస్థ ఎలాంటి సంకేతాన్ని ఇస్తుంది?.ద్రౌపది వస్త్రాపహరణం సభామధ్యలో జరిగినప్పుడు మౌనంగా ఉన్న రాజ్యాంగ వ్యవస్థలు ఏ విధంగా కూలిపోయాయో మహాభారతం చెప్పింది. నేడు శాసనసభ గుమ్మం వద్ద జరిగిన ఈ ఘోరంకూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన మహమ్మారే.ప్రస్తుత ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. పోలీసు బలగాలను ఉపయోగించి ప్రతిపక్షాలను,ప్రత్యేకించిమహిళా నేతలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ద్వారా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు. మహిళా శాసనసభ్యుల చీరలు లాగిన, గొంతు నొక్కిన, జుట్టు పట్టుకుని లాగిన పోలీసు అధికారులను తక్షణమే గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించి, వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా? లేదా, ఈ వికృతచేష్టలకు తామే స్వయంగా ఆదేశాలిచ్చామని, పోలీసుల 'అతి' వెనుక ప్రభుత్వ హస్తం ఉన్నదని బహిరంగంగా ఒప్పుకొంటారా? తాత్కాలికంగా పోలీసు బలగాల వెనుక దాక్కొని, భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షం నోళ్లు మూయించి పాలకులకు పైశాచిక ఆనందం కలుగవచ్చు.

# మీ బడ్జెట్‌కు తగ్గ కారు..

**'శ్రీ వైష్ణవి కార్స్'లోఅందుబాటు ధరల్లో నాణ్యమైన సెకండ్‌హ్యాండ్ కార్లు.. లోన్, ఇన్సూరెన్స్ సౌకర్యం**



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 08:సొంత కారులో కుటుంబంతో కలిసి ప్రయాణించాలన్నది ప్రతి మధ్యతరగతి కుటుంబం కల. అయితే కొత్త కారు కొనుగోలుకు అయ్యే అధిక ఖర్చు కారణంగా చాలామంది తమ కోరికను వాయిదా వేస్తుంటారు. ఇలాంటి వారికి అందుబాటు ధరల్లో నాణ్యమైన సెకండ్‌హ్యాండ్ కార్లను అందిస్తూ ఎల్‌బీనగర్‌లోని శ్రీ వైష్ణవి కార్స్ అందుబాటులో ఉంటోంది.ఎల్‌బీనగర్ సాగర్ రింగ్‌రోడ్‌లోని శ్రీ వైష్ణవి కార్స్‌లో వివిధ కంపెనీలకు చెందిన పలు మోడళ్ల కార్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కస్టమర్ల బడ్జెట్, అవసరాలకు అనుగుణంగా వాహనాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.మంచి కండిషన్‌లో ఉన్న వాహనాలకు ప్రాధాన్యత ఇస్తూ.. కారు కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు లోన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియలో కస్టమర్లకు సహకరిస్తున్నామని చెప్పారు.కస్టమర్ సంతృప్తే లక్ష్యం సిలివేరు రమేష్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలు తమ ఆర్థిక స్థోమతకు అనుగుణంగా సొంత కారు కొనుగోలు చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కస్టమర్ బడ్జెట్, అవసరాలను తెలుసుకుని అందుకు సరిపోయే వాహనాన్ని ఎంపిక చేసుకునేలా సహకరిస్తున్నామని తెలిపారు.నాణ్యత, నమ్మకం, సరసమైన ధరలకు ప్రాధాన్యత ఇస్తూ కస్టమర్లకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. కారు కొనుగోలు చేయాలనుకునే వారు ఒకసారి తమ కార్ల షోరూమ్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న వాహనాలను పరిశీలించవచ్చని కోరారు.మీ కలల కారు.. మీ బడ్జెట్‌లోనే అనే నమ్మకంతో ముందుకు సాగుతున్నామని రమేష్ తెలిపారు.

సంప్రదించండి:సిలివేరు రమేష్: 95501113699959239983

శ్రీ వైష్ణవి కార్స్ఎల్‌బీనగర్ సాగర్ రింగ్‌రోడ్, హైదరాబాద్

# మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిని అడ్డుకున్న పోలీసులు.

**పోలీసుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం.**



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 08(జ్యోతి ప్రభంజనం): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చిట్యాల మీదుగా వెళుతుండగా రామన్నపేటలో పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ ఘటనతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.చిరుమర్తి లింగయ్య తన అనుచరులతో కలిసి కారులో కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ముందుకు వెళ్లకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న తనను ఎందుకు అడ్డుకుంటున్నారని చిరుమర్తి లింగయ్య పోలీసులను ప్రశ్నించారు. అయితే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట, పెనుగులాట చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గాయపడినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. అనంతరం పోలీసులు చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో నల్గొండ లోని టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం: చిరుమర్తిఅనంతరం చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసు ఎస్కార్ట్‌తో కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్దకు పంపిస్తున్న పోలీసులు, తమ పార్టీ నాయకుడు కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న తనను మాత్రం అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.రాజకీయ నాయకుల పట్ల పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం సరికాదన్నారు. రాబోయే రెండేళ్లలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బండారు జనార్ధన్ కు ఘనంగా నివాళులు.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 08(జ్యోతి ప్రభంజనం):చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.చిట్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి బండారు జనార్దన్ (67) ఆదివారం కెనరా బ్యాంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య తదితరులు జనార్దన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో చిట్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందన్నారు. గత రెండు, మూడేళ్లుగా హైవే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో సర్వీస్ రోడ్డుపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని తెలిపారు. దీంతో వాహనదారులు, పాదచారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారని, తాజాగా బండారు జనార్దన్ మృతి చెందడం బాధాకరమని సీతారాములు అన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, పట్టణ వస్త్ర వ్యాపారులు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.





# ఆల్ ఇండియా 8వ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో సత్తా చాటిన కళ్యాణ్ మిక్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు..




హైద్రాబాద్,జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 8:అల్ ఇండియా 8వ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు మహారాష్ట్ర తానే లోని మీహిర్ సీన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జరిగాయి.ఈ పోటీలలో తెలంగాణ హైద్రాబాద్ కు కళ్యాణ్ మిక్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. శౌర్యావిరాజ్,వైష్ణవి,ఉదయకిరణ్,తన్విరెడ్డి,ప్రియాంక,శ్లోకం హానిష,డా; కళ్యాణ్ గౌడ్ మొత్తం 6గోల్డ్ మెడల్స్,5సిల్వర్, 1బ్రౌనజ్ సాధించారు.

# జాతీయ నాయకుల ఆశయాలను విద్యార్థులు కొనసాగించాలి

**: సర్పంచ్ కోన్ రెడ్డి మహిపాల్‌రెడ్డి.**

చిట్యాల,నల్లగొండ:జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 08:జాతీయ



నాయకుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి సేవ చేయాలని చిట్యాల మండలం వనిపాకల గ్రామ సర్పంచ్ కోన్ రెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిట్యాల మండలం వనిపాకల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ సభ్యుడు పంతంగి కరుణాకర్‌గౌడ్ సహకారంతో అందజేసిన పలువురు జాతీయ నాయకుల చిత్రపటాలను సర్పంచ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, వారి త్యాగాలు, దేశ సేవ గురించి తెలుసుకోవాలని సూచించారు. నాయకుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలకు అవసరమైన విద్యా సామగ్రిని అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు పంతంగి కరుణాకర్‌గౌడ్ సహకారంతో పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలను అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి ఏర్పాట్లపై చర్చ

**విశ్వకర్మ కుటుంబాల సమగ్ర సర్వేపై సంఘం సమావేశంలో చర్చ**

గట్టు,జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 8:గట్టు మండల విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 17న నిర్వహించనున్న విశ్వకర్మ జయంతి వేడుకల ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణపై సంఘం నాయకులు చర్చించారు.విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు



చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఏర్పాట్లపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అలాగే మండల పరిధిలోని విశ్వకర్మ కుటుంబాల సమగ్ర సర్వే నిర్వహించే అంశంపై కూడా సమావేశంలో చర్చించారు.మండలంలోని విశ్వకర్మ కుటుంబాల వివరాలను సేకరించి, వారి సమస్యలు, అవసరాలను గుర్తించి సంఘం ద్వారా తగిన విధంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.విశ్వకర్మ సమాజ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

# పదేళ్లు గడిచినా మారని కార్యాలయ బోర్డు

– పశుసంవర్ధక శాఖలో అధికారుల నిర్లక్ష్యం

– ఆర్టీఐ చట్ట నిబంధనల అమలుపైనా నిర్లక్ష్యమే

– అసహనం వ్యక్తపరచిన పొన్నెకంటి సంజీవరాజు




భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడి దాదాపు పదేళ్లు గడుస్తున్నా.. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మాత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆనవాళ్లు తొలగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఆరోపించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద ఇప్పటికీ గత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన బోర్డు దర్శనమిస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన జరిగి ఇంతకాలం గడిచినా కార్యాలయ బోర్డుపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరును సూచించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నించేలా ఉందన్నారు. సహాయ సంచాలకుల కార్యాలయం మొదటి అంతస్తులో కొనసాగుతుండగా కింది భాగంలో పశువుల ఆసుపత్రి నిర్వహిస్తున్నారని సంజీవరాజు తెలిపారు. అయితే ఆసుపత్రికి కనీసం బోర్డు కూడా లేకపోవడం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించే విధంగా వివరాలు ప్రదర్శించకపోవడం పట్ల ఆయన ఆక్షేపించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం?2005కు సంబంధించి అప్పిలేట్ అధికారి, సహాయ అప్పిలేట్ అధికారి పేర్లు, నోటీస్ బోర్డు, కార్యాలయ సిబ్బంది వివరాలు వంటి కీలక సమాచారాన్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉంచలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరుతో నూతన బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు పశువుల ఆసుపత్రికి ప్రత్యేక బోర్డు ఆర్టీఐ చట్టానికి సంబంధించిన అధికారుల వివరాలు నోటీస్ బోర్డు సిబ్బంది వివరాలను ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని పొన్నెకంటి సంజీవరాజు కోరారు. అధికారుల నిర్లక్ష్యానికి ముగింపు పలికి ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భూముల రీ–సర్వే పనులను వేగవంతం చేయాలి

: జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ–సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ–సర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం హద్దులు స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీ–సర్వే చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీ–సర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు సర్వేకు అవసరమైన సిబ్బంది పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.భూముల రీ–సర్వేలో భాగంగా ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గ్రామంలో భూరీ–సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు రికార్డులు పత్రాలు సేకరించి భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భూముల విషయంలో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా రీ–సర్వే ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ–సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. భూముల రీ–సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రజాపాలన

ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డు..

సన్నబియ్యం అందించడమే లక్ష్యం



తాండూర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 8:పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రజాపాలన అందిస్తోందని అంతారం గ్రామ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గత పదేళ్లుగా నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వారు ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డు అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ అర్హత కలిగిన కుటుంబాలకు కార్డులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు.రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం అందించడంతో పాటు, కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు కూడా స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. అంతారం గ్రామంలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారితో పాటు ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పార్టీలకు అతీతంగా అందజేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పేదల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంతారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి

# ప్రతిపాదిత స్థలాల పరిశీలన

- తిమ్మంపేటలో పరిశీలనను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్

- పరిశీలన వివరాలను కలెక్టర్‌కు వివరించిన బృంద సభ్యులు



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం రెండు రోజులుగా జిల్లాలోని ప్రతిపాదిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలతపై వివిధ సాంకేతిక అంశాలను అధ్యయనం చేస్తోంది. మంగళవారం ములకలపల్లి మండలం తిమ్మంపేటలో జరుగుతున్న సాంకేతిక పరిశీలనను ఏఏఐ బృంద సభ్యులతో కలసి జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యవేక్షించారు.జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతా నగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భౌగోళిక భౌతిక సాంకేతిక ప్రమాణాలను పరిశీలించేందుకు ఏఏఐ సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టింది.ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండి ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో భూమి స్వభావం ఎత్తుపల్లాలు కొండలు కొండచరియలు అటవీ ప్రాంతాలు నీటి ప్రవాహ మార్గాలు రహదారులు రైల్వే మార్గాలు విద్యుత్ లైన్లు తదితర అంశాలను పరిశీలించింది. విమానాశ్రయానికి అత్యంత కీలకమైన రన్‌వే ఏర్పాటుకు అవసరమైన ప్రాంతం విమానాల రాకపోకలకు సంబంధించిన అప్రోచ్ ప్రాంతం పరిసరాల్లో ఉన్న అడ్డంకులు తదితర అంశాలపై కూడా సాంకేతికంగా అంచనా వేసింది. గతంలో ప్రతిపాదించిన ప్రాంతాలకు సంబంధించి మ్యాప్‌ల ఆధారంగా సుమారు 500 ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించినప్పటికీ విమానాశ్రయానికి అవసరమైన రన్‌వే అప్రోచ్ ఇతర అనుబంధ సౌకర్యాల దృష్ట్యా అదనపు ప్రాంతాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సాంకేతిక బృందం తెలిపింది. ముఖ్యంగా అప్రోచ్ ప్రాంతానికి సుమారు 1.5 కిలోమీటర్ల వరకు అదనపు స్థలం అవసరమయ్యే అవకాశాలను కూడా బృందం పరిశీలిస్తోందని తెలిపారు. కొన్ని ప్రతిపాదిత ప్రాంతాల్లో రైల్వే మార్గం సమీపంలో ఉండటాన్ని కూడా సాంకేతిక బృందం పరిశీలించింది. సత్తుపల్లి గూడ్స్ రైల్వే లైన్ ప్రతిపాదిత ప్రాంతానికి సుమారు 100 నుంచి 120 మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల్లో రన్‌వే దిశ, విమానాల అప్రోచ్‌కు దాని ప్రభావం తదితర అంశాలను అధ్యయనం చేస్తున్నారు. రైల్వే విద్యుదీకరణ వ్యవస్థ కారణంగా ఏర్పడే విద్యుదయస్కాంత ప్రభావాలు విమానాశ్రయ కమ్యూనికేషన్ నావిగేషన్ పరికరాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అవసరమైన సాంకేతిక రక్షణ చర్యలు రైల్వే శాఖ నుంచి అవసరమైన అనుమతులు  తదితర అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని బృందం వివరించింది. ఈ సందర్భంగా ఏఏఐ సభ్యులు, సాంకేతిక బృందం చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వివరించారు. ప్రతిపాదిత ప్రాంతాలకు సంబంధించిన రెవెన్యూ సర్వే అటవీ రహదారులు రైల్వే భౌగోళిక వాతావరణ తదితర వివరాలను సాంకేతిక బృందానికి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, సిపిఓ సునీత, ములకలపల్లి తాసిల్దార్ స్వాతి బిందు, ఆర్‌అండ్ బి నాగేశ్వరరావు, సర్వే అధికారు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో రాణించాలి

క్రీడాకారులకు సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి పిలుపు



అబ్దుల్లాపూర్ మెట్టు, జ్యోతి ప్రభంజనం,, సెప్టెంబర్ 8:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా  ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం బాటసింగారం గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ సొసైటీ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అండర్–14, అండర్–17 బాలుర ఖో–ఖో పోటీలను గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి, ఉప సర్పంచ్ నార్లకొండ వెంకటేష్, ప్రిన్సిపాల్ ఉషారాణి కలిసి ప్రారంభించారు. పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం, క్రీడా సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని అన్నారు.క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి వంటి లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడుతున్న నేపథ్యంలో క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని సర్పంచ్ అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ ఏదో ఒక క్రీడలో చురుకుగా పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.మండల స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు తదుపరి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటి జాతీయస్థాయిలో విజయాలు సాధించి అబ్దుల్లాపూర్‌మెట్



మండలానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మండల ప్రతినిధులు చంద్రమోహన్, జగన్మోహన్ రెడ్డి, నరసింహారావు, రూబీ, జోసువా, లక్ష్మి, మధు, నీలేష్, అంజి, ఉదయ్, నవ్య, జయలక్ష్మి, లక్ష్మణ్, మహేష్, సాయి, అనిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్,

# స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థుల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తాం**

**: పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్**

హైదరాబాద్ జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 08:పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ లోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్ మాట్లాడుతూ




కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, ఎన్నికల మేనిఫెస్టో లోనూ ఈ అంశాన్ని పొందుపరిచిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్, ఎంటెక్, బీఈడీ, ఎంఈడీ తదితర కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. అనేక మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యను కొనసాగించలేక పోతున్నారని తెలిపారు.

**చిన్న కాలేజీలు మూత.. కార్పొరేట్ కాలేజీలకు ప్రోత్సాహం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో చిన్న ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో మూతపడుతున్నాయని, అదే సమయంలో కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నాయని మహేష్ విమర్శించారు. ప్రభుత్వం వివిధ ప్రాజెక్టులు, ఇతర కార్యక్రమాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదని అన్నారు.

**'స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదు.. విద్యార్థుల హక్కు'**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ఖఆూజ డిమాండ్ చేసింది. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వాల భిక్ష కాదని, అవి విద్యార్థుల హక్కులని మహేష్ స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల పెండింగ్ బిల్లులను వేల కోట్ల రూపాయల మేర క్లియర్ చేస్తున్న ప్రభుత్వం.. విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే ధర్నా చౌక్‌ను కేంద్రంగా చేసుకుని ఢిల్లీలోని జంతర్ మంతర్ తరహాలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

**'విద్యార్థి ఉద్యమ సెగ ప్రభుత్వానికి తగులుతుంది'**

పీడీ ఎస్ యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థి ఉద్యమ సెగ తగులుతుందని హెచ్చరించారు. విద్యారంగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేకపోవడం వల్లే పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు భారీ వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం.. విద్యార్థుల చదువులకు అవసరమైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో నిర్లక్ష్యం చేయడం తగదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గడ్డం గౌతమ్, నాయకులు హరీష్, సంతోష్, రాజేష్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనాపురం రిజర్వాయర్‌ను

# త్వరితగతిన పూర్తి చేయాలి

**రైతులకు సాగునీరు.. గ్రామాలకు తాగునీరు అందించాలి**

**: పాలడుగు నాగార్జున**



నాంపల్లి, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 8: లక్ష్మీనాపురం రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు, పరిసర గ్రామాలకు తాగునీరు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత 36వ రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నాంపల్లి మండల కేంద్రంలో రైతులు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు సంఘం జాతీయ నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, ప్రతినిధులు మహాసభలకు హాజరవుతారని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధర, నాణ్యమైన ఎరువుల సరఫరా, వ్యవసాయ రంగంపై ప్రభుత్వాల విధానాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

**పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి**

నాంపల్లి ప్రాంతంలోని లక్ష్మీనాపురం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని నాగార్జున డిమాండ్ చేశారు. రిజర్వాయర్ పూర్తయితే రైతులకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి, సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న భారత్?అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రైతాంగ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని నాగార్జున అన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లు అమలైతే వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా రైతులను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు నిర్వహించిన పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు స్పందించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, మండల కమిటీ సభ్యుడు వాషిపాక ముత్తిలింగం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము లక్ష్మయ్య రాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ మహిళల ఆగ్రహం

**కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణికి నిరసన**



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 08:ప్రజా పాలన, ప్రజా పాలన అంటూ ప్రజా వ్యవస్థనే కూని చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారపూరిత ధోరణి నశించాలని డిమాండ్ చేస్తూ నిన్న అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను చూడకుండా జుట్టు పట్టుకొని తోసి వేస్తూ జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ ఎల్బీనగర్ మహిళల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగానే ఒక ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి కేవలం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుని అనుకరించి వారికి కనుసైగలలోని గౌరవ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై వీర్లపల్లి శంకరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై గాను ఆధ్వర్యంలో వీర్లపల్లి శంకరయ్య దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ, ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎల్బీనగర్ మహిళలు తీవ్రంగా ఖండించారు. 420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించడానికి మహిళలే చాలు" అని ఎల్బీనగర్ మహిళలు మరోసారి నిరూపించారు. ఎవరి ప్రోద్బలంతో కాకుండా స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, నిన్న మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని,




తాము ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడమే కాకుండా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఎల్బీనగర్ మహిళలు డిమాండ్ చేశారు. అనంతరం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు మహిళలు ర్యాలీగా వెళ్లి ఏసిపి గారికి మరియు సిఐ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మనాయక్,మల్లీశ్వరిరెడ్డి,రంగేశ్వరి నాయుడు,శైలజ,రమాదేవి, విజయ,అంజలి,లత, దేవి, మమత,శిల్పరెడ్డి,వాణి,సూరజ్,ఎస్దాని,కల్పన,లక్ష్మి,పార్వతి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కరువు ప్రాంతంగా మర్రిగూడ మండలంను ప్రకటించాలి.

**తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్.**



మర్రిగూడెం, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 08:నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం కరువు ప్రాంతంగా మర్రిగూడ మండలమును ప్రకటించాలని పత్రిక విలేకరుల సమావేశంలోమర్రిగూడ మండల తె.దే.ప. పార్టీ అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. రైతులు వేసిన పంటలకు పెర్టిలైజర్ షాపులలో లక్షలాది రూపాయలు పెట్టి మందులు తెచ్చి పెట్టుబడులు పెట్టడం జరిగింది. రైతులు వేసిన పంటలకు వర్ష దేవుడుకనుకరించకపోవడంతో రైతులు లబోదిబో మొత్తుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నష్టపరిహారము ప్రభుత్వం వెంటనే ఎకరానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయాలని తె.దే.ప. పార్టీ అధ్యక్షులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీజు రియంబర్మెంటు స్కాలర్షిప్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుకుంటుందని ప్రభుత్వం సిగ్గుమాలిన చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. వివిధ పార్టీ నాయకులు ఫీజు రివంబర్ మెంట్ గురించి తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజా స్వామికమని ఆయన అన్నారు. కార్యక్రమంలో తె.దే.ప .పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లేష్, తె.దే.ప.పార్టీ ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గునుగంటి శ్రీరాములు, బీసీ సెల్ అధ్యక్షులు కాసర్ల అంజయ్య, వీరమల్ల మల్లేష్, వరికుప్పల శ్రీనివాస్, బరిగల గణేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు .

# దళిత స్పీకర్‌ను అవహేళన చేయడం తగదు

**ఎమ్మెల్సీ తాతా మధును పదవి నుంచి బహిష్కరించాలి**

**: కాంగ్రెస్ నాయకుడు అశోక్ గంటేకంపు**



మునుగోడు, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 08: ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని శాసనసభ స్పీకర్‌గా నియమించడాన్ని చూసి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓర్వలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అశోక్ గంటేకంపు విమర్శించారు. తన పాలనలో దళితులకు కేసీఆర్ అన్యాయం చేశారని ఆరోపించారు. దళితులకు మంత్రి పదవులు ఇవ్వకుండా, ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన తాటికొండ రాజయ్యను సైతం అర్ధాంతరంగా పదవి నుంచి తొలగించారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతున్నారని, అయితే కేసీఆర్ అసెంబ్లీకి హాజరై స్పీకర్‌ను గౌరవంగా సంబోధించలేని పరిస్థితిలో ఉన్నారని అశోక్ వ్యాఖ్యానించారు. మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న భ్రమలో కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. దళితులు తలచుకుంటే గత పాలన తిరిగి రావడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్**

శాసనసభలో స్పీకర్‌ను అవహేళనగా సంభాషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ తాతా మధుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అశోక్ గంటేకంపు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పదవి నుంచి ఆయనను బహిష్కరించాలని కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**